# విశ్వజ్ఞానయజ్ఞం – 2021


# మహాత్ములు నేటి తరానికి మార్గదర్శకులు

## నాదయోగి - త్యాగయ్య రెండవ రోజు (6/27/2021)

శివాయ గురవే నమః

శ్రీమాత్రేనమః

శ్రీవిష్ణురూపాయనమఃశివాయ



















నిన్నటి రోజు త్యాగయ్య చరిత్ర ప్రస్తావిస్తూ త్యాగయ్య హృదయము గ్రహించాము! జీవితాన్ని భక్తి మార్గంగా, ఆ మార్గంలో ఉన్న వారికి మార్గదర్శకంగా చూపించిన మహానుభావులు!

సామాన్యుల హృదయంలో కూడా గుర్తు ఉండిపోయే సాహిత్యాన్ని అందించారు!

భజనకి అనుపైనవి కూడా ఎన్నో రచించారు!

*సీతా కల్యాణ

**ప. సీతా కల్యాణ వైభోగమే**

**రామ కల్యాణ వైభోగమే**

**చ1. పవనజ స్తుతి పాత్ర పావన చరిత్ర**

**రవి సోమ వర నేత్ర రమణీయ గాత్ర (సీతా)**

**చ2. భక్త జన పరిపాల భరిత శర జాల**

**భుక్తి ముక్తిద లీల భూ-దేవ పాల (సీతా)**

**చ3. పామరాసుర భీమ పరిపూర్ణ కామ**

**శ్యామ జగదభిరామ సాకేత ధామ (సీతా)**

**చ4. సర్వ లోకాధార సమరైక వీర**

**గర్వ మానవ దూర కనకాగ ధీర (సీతా)**

**చ5. నిగమాగమ విహార నిరుపమ శరీర**

**నగ ధరాఘ విదార నత లోకాధార (సీతా)**

**చ6. పరమేశ నుత గీత భవ జలధి పోత**

**తరణి కుల సంజాత త్యాగరాజ నుత (సీతా)**

*క్షీరసాగర విహార

**ప. క్షీర సాగర విహార అపరిమిత**

**ఘోర పాతక విదార**

**క్రూర జన గణ విదూర నిగమ**

**సంచార సుందర శరీర**

**చ1. శతమఖాహిత విభంగ శ్రీ రామ**

**శమన రిపు సన్నుతాంగ**

శ్రిత మానవాంతరంగ జనకజా

శృంగార జలజ భృంగ (క్షీ)

చ2. రాజాధి రాజ వేష శ్రీ రామ

రమణీయ కర సు-భూష

రాజ నుత లలిత భాష శ్రీ త్యాగ-

రాజాది భక్త పోష (క్షీ)

* రఘునందన రఘునందన రామా

ప. రఘు నందన రఘు నందన రఘు నందన రామ

చ1. పాడుదు నిను వేడుదు కొనియాడుదు శ్రీ రామ (రఘు)

చ2. కోరితి నిను జేరితి నను దూరకుమీ రామ (రఘు)

చ3. ఏమోయని నీ మనసున ఏమరకే రామ (రఘు)

చ4. గతి లేదని పతి నీవని మతి నే శరణంటి (రఘు)

చ5. జాలము నీకేలను నే తాళను శ్రీ లోల (రఘు)

చ6. గట్టిగ నిను పట్టిన తనకిట్టి వెతలేల (రఘు)

చ7. నీకే దయ నీకే దమ నీకెవరే సాటి (రఘు)

చ8. నిను తెలిసిన ఘనులను నే దిన దినమును తలతు (రఘు)

చ9. ముల్లోకములల్లాడిన ఇల్లే గతి కాని (రఘు)

చ10. ఇలనంతట కల వానకు జలధే గతి కాని (రఘు)

చ11. గుణములలోనణిగుంటే గుణియే గతి కాని (రఘు)

చ12. ఎన్ని వితములున్నాను నిన్నే చేరవలె (రఘు)

చ13. శ్రిత మానవ హిత-కర పాలిత త్యాగరాజ (రఘు)

భావగాంభీర్యం చాలా ఉంటుంది చూడడానికి సులువుగా ఉన్నా కూడా!

భక్తికి సూచనలు, మార్గాలు, యమకాలు కూడా కనపడుతూ ఉంటాయి! సంగీతానికి శోభని ఇచ్చే వాంఙ్మయం!

## విభాగములు: త్యాగరాజభక్తి, త్యాగరాజయోగము, త్యాగరాజముక్తి

నానా దోషాలు ఎంచకు స్వామి అంటున్నారు! గట్టిగా నిన్ను పట్టుకున్న నాకు నీ వియోగ బాధ ఎందుకు అని అడుగుతున్నారు! వారి ఆర్తి అంతా భగవద్వియోగాన్ని తట్టుకోలేని వేదన! ఆయన్ని మాత్రమే కోరుకుంటారు త్యాగయ్య, అన్నమయ్య మొదలైనవారు! అసలు శరణాగతి భగవంతుడు!
*జీవితం దేనికి? భగవత్ ప్రాప్తికి! ఆ స్పష్ట లక్ష్యం పెట్టుకున్నాక ఎటు పోతున్నామో అన్న కన్ఫ్యూషన్ పోతుంది! లక్ష్యానికి తగ్గట్లు జీవించాలి! గమ్యానికి తగ్గట్లు వెళ్ళాలి అనుకున్నప్పుడు ఆ దిశలో ఎలా వెళతామో!*

*గమ్యం, గమనం, మార్గం గమ్యము, గమనము వేరు కాకూడదు కదా! గమ్యం భగవంతుడు, గమనం సాధన, మార్గం భక్తి!*

***ముల్లోకముల్లలాడిన ఇల్లే గతి కానీ ఇలనంతట కలవానకు జలధే గతికాని***

*ఒకడు ఎంత తిరిగినా ఎక్కడికి తిరిగినా తన ఇంటికే చేరతాడు! ఎన్ని జన్మలు తిరిగినా పరమాత్మ అనే "స్వ" ని చేరాలి! ఆయనకంటే దగ్గరివాడు లేడు! పరమాత్మనే చేరాలి అని తెలుసుకున్నవాడు, ఎన్నో జన్మల దూరం కాకుండా ఈ జన్మలోనే పొందాలి! ఆ తహతహ ఉండాలి!*

* రామా కోదండరామా

**ప. రామ కోదండ రామ రామ కల్యాణ రామ**

**చ1. రామ సీతా పతి రామ నీవే గతి**

**రామ నీకు మ్రొక్కితి రామ నీ చే జిక్కితి (రా)**

**చ2. రామ నీకెవరు జోడు రామ క్రీ-కంట జూడు**

**రామ నేను నీవాడు రామ నాతో మాటాడు (రా)**

**చ3. రామ నామమే మేలు రామ చింతనే చాలు**

**రామ నీవు నన్నేలు రామ రాయడే చాలు (రా)**

**చ4. రామ నీకొక మాట రామ నాకొక మూట**

**రామ నీ పాటే పాట రామ నీ బాటే బాట (రా)**

**చ5. రామ నేనెందైనను రామ పేరెంచ లేను**

**రామయెన్నడైనను రామ బాయక లేను (రా)**

**చ6. రామ విరాజ రాజ రామ ముఖ జిత రాజ**

**రామ భక్త సమాజ రక్షిత త్యాగరాజ (రా)**

రామా నీకొక మాట నాకొక మూట; రామా నీ పాటే పాట నీ బాటే బాట

రాస్తే రాముడి గురించే, మాట పలికితే రాములవారి గురించే! నడవాల్సిన మార్గం రాములవారు చూపించినదే!

## త్యాగరాజభక్తి

భక్తి అంటే భాగవత మార్గం చూపించిన జ్ఞాన, వైరాగ్య యుత భక్తి! భక్తి శాస్త్ర పాఠాలే త్యాగరాజ కీర్తనలు!

*బంటురీతి కొలువు

**ప. బంటు రీతి కొలువియ్యవయ్య రామ**

**అ. తుంట వింటి వాని మొదలైన**

**మదాదుల కొట్టి నేల కూల జేయు నిజ (బ)**

**చ. రోమాంచమను ఘన కంచుకము**

**రామ భక్తుడను ముద్ర బిళ్ళయు**

**రామ నామమను వర ఖడ్గమివి**

**రాజిల్లునయ్య త్యాగరాజునికే (బ)**

ఒకడి దగ్గర దాస్యం చేయాలంటే అహంకారం విడవాలి! యజమాని యొక్క ఆజ్ఞలో ఉండాలి!

భగవంతుడు చెప్పిన ధర్మాన్ని పాటిస్తూ, అహంకారం ఆయనకి అర్పణ చేయడమే దాస్యం!

బంటురీతి కొలువు ఇవ్వమని అడిగే కీర్తన!

వీరభక్తి అని వింటూ ఉంటాము!

మన్మథుడు మొదలగు శత్రువులను (కామాది శత్రువులు) నేలకూలచేయగలిగే వీరబంటు రీతి కావలి!

**భక్తుడికి ఉండవలసిన లక్షణములు మూడు చెప్తున్నారు:**

1) కామాదులను జయించాలి! జయించే ప్రయత్నం అయినా చేస్తే భగవంతుడు తప్పక రక్షిస్తాడు!
2) తాదాత్మ్యం
3) నిజబంటు - మరొక వైపు చెదరని అంకితత్వం!

బంట్రోతుకు ఒక కంచుకం ఇస్తారు! దానికి బిళ్ళ, అతని దగ్గర ఆయుధం ఉంటాయి!

- రోమాంచము- ఘనకంచుకం (వస్త్రం)
- రామభక్తుడు - ముద్రబిళ్ళ (రామునివాడు అనే ముద్ర) భక్తుడిని చూసినప్పుడు దేవుడు గురుతు వస్తే ఆ భక్తుడి జన్మ సార్థకమే!
- రామనామము -ఖడ్గం; రామనామమే రక్షగా, ఆయుధముగా

ఇవి ఇచ్చి నన్ను బంటుని చేయవయ్యా!

భగవంతుడిని తలంచుకోగానే ఒళ్ళు పులకించిపోవాలి! ("హొయలు మీర") అది సాత్త్వికోద్రేకం! భగవంతుని చింతన వల్ల అది కలిగితే అదే భోగ శరీరం అంటారు శంకరులు! అది భగవంతుని దగ్గర చేస్తాయి, అనుభూతిని కలిగిస్తాయి!

**భక్తుడి భూమికలు:** భక్తుడి భావనా భూమికలు అనేకరకంగా ఉంటాయి! ఒక్కొక్కప్పుడు తృప్తి పడతాడు ఎంత గొప్ప జన్మ అని, ఒక్కొక్కసారి భగవంతుడు కనపడలేదని ఆర్తి, ఒక్కొక్కసారి నేనెంత పాపిని అని నైత్యానుసంధానం చూపిస్తాడు! ఇవి రకరకాల భూమికలు!

* ఇంతకన్న ఆనందమేమి ఓ రామా

**ప. ఇంతకన్నానందమేమి ఓ రామ రామ**

**అ. సంత జనులకెల్ల సమ్మతియైయుండు కాని (ఇ)**

**చ1. ఆడుచు నాదమున పాడుచు ఎదుట రా**

**వేడుచు మనసున కూడియుండుట చాలు (ఇ)**

**చ2. శ్రీ హరి కీర్తనచే దేహాది ఇంద్రియ**

**సమూహముల మరచి సోహమైనదే చాలు (ఇ)**

**చ3. నీ జపములు వేళనీ జగములు నీవై**

**రాజిల్లునయ త్యాగరాజ నుత చరిత్ర (ఇ)**

- సంత జనులు అనగా సత్పురుషులు, వాళ్ళు అంగీకరించి సమ్మతించేటట్లు ఉండడమే గొప్ప జీవితం! సత్పురుషులు మెచ్చేటట్లు జీవించాలి!
- నీ గురించే ఆనందిస్తూ (ఆడుచు, మాటలాడుచు), నాదమున పాడుచు, నువ్వు ఎదుట ప్రత్యక్షం కావాలని వేడుకుంటూ మనసున కూడి ఉంటే అదే చాలు!
- శ్రీహరి కీర్తన వల్ల క్రమంగా శరీరాన్ని మరచి, ఇంద్రియస్పృహ పోవాలి! అలా మైమరచి దేహాది ఇంద్రియముల సమూహములు మరచి సోహమైతే చాలు! దేహాత్మభ్రాంతి పోయి పరమాత్మ ప్రాప్తి దొరుకుతుంది!

**జపం చేసేటప్పుడు ఎలా ఉండాలి? -** జపం ఎటువంటి స్థితిని ఇవ్వాలి అంటే జగములన్ని రామమయం (ఏ దేవతని మంత్రంతో జపిస్తే ఆ దేవత) అని గోచరించాలి!

నేను ఏ దేవతని జపిస్తున్నానో ఈ జగమంతా ఆయన స్వరూపమే అని గోచరించాలి!

జగమే జగన్నాథ మయం అనే స్పృహ కలగాలి!

ఇదే స్థితి వాల్మీకి మహర్షికి రామాయణం రచించే ముందర కలుగుతుంది!

రామదాసుకి ఆ స్థితి కలిగింది కనుకనే అంతా రామమయం అని పాడారు!

ఈ అనుభూతి సరి అయిన మార్గంలో జపం చేసే వారికి దొరుకుతుంది!

* భక్తి బిచ్చమీయవే భావుకమైన సాత్త్వికమగు

**ప. భక్తి బిచ్చమియ్యవే**

**భావుకమగు సాత్వీక (భ)**

**అ. ముక్తికఖిల శక్తికి త్రి-**

**మూర్తులకతి మేల్మి రామ (భ)**

**చ. ప్రాణము లేని వానికి బంగారు పాగ చుట్టి**

**ఆణి వజ్ర భూషణమురమందు పెట్టు రీతి**

**జాణలకు పురాణాగమ శాస్త్ర వేద జప ప్రసంగ**

**త్రాణ కల్గియేమి భక్త త్యాగరాజ నుత రామ (భ)**

ఎన్నో శాస్త్రముల పరిజ్ఞానం కలిగినవాడు, లోతు తెలిసిన మహానుభావుడు!

- భగవంతుడే భక్తిని ఇవ్వాలి! ఆయన అనుగ్రహం లేనిదే భక్తి లేదు, భక్తి లేనిదే అనుగ్రహం లేదు!
- ఏదో భక్తి తెచ్చుకోవాలి అని మనం ప్రయత్నం చేస్తూ ఏదో పూర్వజన్మ వాసనల వల్ల కాస్త ఆయనవైపు తిరిగితే అప్పుడు ఆయన అనుగ్రహం లభించి దానివల్ల భక్తి వస్తుంది!
- భక్తి నాకు కలిగింది అన్నా కూడా అహంకారమే! అదే నువ్వు ఇయ్యవయ్యా అని ఆయన్ని అడిగితె అహంకారం కరుగుతుంది!
- సాత్త్వికభక్తిని అడుగుతున్నారు! రాజస, తామస భక్తులు లోకాలు తిప్పుతూ ఉంటాయి! సాత్త్విక భక్తి: చిత్తశుద్ధి, ఈశ్వరార్పణం అయిన బుద్ధి! చేసిన ప్రతీ కర్మ ఈశ్వరార్పణ బుద్ధితో చేయడం! ఇది త్రిగుణాల్లో ఒకటి అయినా నిర్గుణ భక్తిలోకి తీసుకెళుతుంది! అప్పుడు ఎక్కడైనా భగవద్ అనుభూతి లభిస్తుంది!
- భావుకం: నిరంతరం భగవంతుని భావించగలిగి ఉండడం!
- భక్తి ముక్తిని ఇస్తుంది, సర్వవిధములైన సమర్ధతని ఇస్తుంది!
- బ్రహ్మ, విష్ణు, శివాత్మకమైన పరబ్రహ్మ మెచ్చినది భక్తి మార్గం! ఎప్పుడు? గీతలో! శ్రద్ధతో నన్ను భజించేవాడు యోగులలో గొప్పవాడు అని స్వామి ప్రకటించాడు కదా!
- ప్రతీ మార్గాన్ని కలుషితం చేసే పండితులు ఉంటారు, అనవసరపు చర్చలు చేస్తూ! నిర్మలమైన అద్వైతంలో కూడా పండితులు దూరి అనవసరపు నిరసనలు చేస్తూ ఉంటారు! భక్తి మార్గాన్ని కూడా అలా పాడుచేసే వారు ఉంటూ ఉంటారు! భక్తిలేనప్పుడు ఎటువంటి పాండిత్యం అయినా వ్యర్థం! ప్రాణం లేని శరీరానికి ఎన్ని అలంకారాలు చేస్తే ఏమైనా శోభా? భక్తిలేని వాడికి సర్వశాస్త్ర వేదాది పురాణాలూ, జపాలు ఇవన్నీ వ్యర్థం!
  భక్తి అనే ధాతువు లేనప్పుడు ఎన్ని ఉన్నా ఒక్కటే!

*ప. నిత్య రూప ఎవరి పాండిత్యమేమి నడుచురా

అ. సత్యమైనయాజ్ఞ మీర సామర్థ్యము కలదా (ని)

చ. భాను పగలు రేయి రత్న సాను జుట్టడా

పూని శేషుడమిత భార భూమి మోయడా

వీనులందు కాశీ పతి నీ నామము పల్కడా

మాని త్యాగరాజ వినుత మహిమాస్పదమగు నీ ముందు (ని)

*** ప. మనసా మన సామర్థ్యమేమి ఓ (మ)**

**అ. విను సాకేత రాజు విశ్వమనే రథమునెక్కి**

**తన సామర్థ్యముచే తానే నడిపించెనే (మ)**

**చ. అల నాడు వసిష్ఠాదులు పట్టము కట్టే**

**పలుకుల విని వేగమే భూషణములనొసగిన కైకను**

**పలుమారు జగంబులు కల్లలనిన రవిజుని మాయ**

**వల వేసి త్యాగరాజ వరదుడు తా చనగ లేదా (మ)**

- లోకంలో కర్మ మార్గాలవైపు వెళదాం అంటే ఒక అహంకారం, ఆందోళన కలుగుతూ ఉంటాయి! అందుకు కర్మలు భగవదర్పణంతో ప్రేమగా చేయాలి! అదే విధంగా శాస్త్రజ్ఞానములు చదువుతూ ఉంటే భ్రమలు కలుగుతూ ఉంటాయి! అందుచేత వాదాలకి వెళ్ళక ఈ దొరికిన జన్మని సార్ధకం చేసుకోవాలి!

*** ఈ జన్మమున నిన్ను రాజీ జేసుకొన లేక రాజిల్లరని త్యాగరాజ రాజ రాఘవ**

ఈ జన్మలోనే భగవంతుని ప్రసన్నం చేసుకోనిదే చరితార్థులు కారు!

- నిన్నే నెరనమ్మినానురా: సంపూర్ణంగా నమ్మి ఉన్నాను అని అనడం
- అన్ని కల్లలనుచు: ***లోకాన్ని నమ్మదగింది కాదు! లోకం మిథ్యా రూపం! ఇది ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి! లోకం ఆకర్షించిన ప్రతీసారి ఇది మిథ్య అని తెలిసినప్పుడు అది ఆకర్షించదు! ఈ లోకం ఈశ్వరాభిముఖంగా ప్రయాణించడానికి ఎంత అవసరమో అంత తీసుకోవాలి!***
- ***అందుకు లోకం అనిత్యం అని తెలుసుకుంటూ, ఆ పరమాత్మనే ఆడి, పాడి, వేడి అన్నారు!***
- ఆడి - ఆనందంగా భగవత్సాధన చేయడం!
- పండితులని చూసి అయినా వైరాగ్యం కలగాలి! కొందరు పండితులు ఎంత అహంకారంతో ఉంటారంటే అనవసరపు చర్చలు, రీసెర్చ్ లు చేస్తూ ఉంటారు! రాముడిలో దైవత్వాన్ని దర్శించలేని పాండిత్యం ఎందుకు? ఇటువంటి పండితులని చూసి "శబ్దజాలం మహారణ్యం చిత్తవికార కారకం" వాగ్వైఖరి శబ్దఝురి శాస్త్ర వాక్యా కౌశలం భుక్తయే నతు ముక్తయే” అని తెలుసుకోవాలి!

- అటువంటి వారిని చూసి, నిన్నే నెరనమ్మినానురా అంటున్నారు!
- భోగాలకోసం సాధన చేసే రాజసభక్తులని చూసి, వారి కర్మజాలం చూసి వీటితో కూడా తరించలేము అని తెలుసుకుని నిన్నే నమ్మాను అంటున్నారు! ఇక్కడ యాగాలని నిరసించడంలేదు, భోగాల కోసం వద్దు అంటున్నారు! ఈశ్వరార్పణ బుద్ధితో శాస్త్రము నిర్దేశించిన నిత్య, నైమిక్తిక కర్మలను మానరాదు అని తెలుసుకోవాలి!
- వీటి అన్నిటిలో పడితే ఆయువు అయిపోతుంది, అందుచేత నిన్నే నెరనమ్మినానురా అంటున్నారు!
- శాస్త్రాల పరమార్థం రాములవారు అని త్యాగరాజస్వామికి తెలుసు!
- జ్ఞాని మరింత గొప్ప. భక్తుడు అవుతాడు తప్ప భక్తులని తిరస్కరించడు!

* జ్ఞానమొసగరాదా

**ప. జ్ఞానమొసగ రాదా గరుడ గమన వాదా**

**అ. నీ నామము చే నా మది నిర్మలమైనది (జ్ఞా)**

**చ. పరమాత్ముడు జీవాత్ముడు పదు-నాలుగు లోకములు**

**నర కిన్నర కింపురుషులు నారదాది మునులు**

**పరిపూర్ణ నిష్కళంక నిరవధి సుఖ దాయక**

**వర త్యాగరాజార్చిత వారము తానసే (జ్ఞా)**

- ఏంటి స్వామి తర్కిస్తున్నావా? తొందరగా జ్ఞానం ఇవ్వవయ్యా! నీ నామస్మరణచే నా మనసు నిర్మలమైనది కావున జ్ఞానం ఇవ్వవయ్యా!
- జ్ఞానం అంటే ఏమిటి? చరణాల్లో చెప్తున్నారు! ఈ కీర్తనలో ఏది కోరాడో అది పొందాడు ఆఖరికి! నాదముతో ముక్తిని పొందవచ్చు అని తన జీవితాన్ని సాక్ష్యంగా చూపించిన మహానుభావుడు! నువ్వు తప్ప మరొకటి లేదు అనే ఎరుకలోకి రావడమే జ్ఞానం!
- సృష్టి నిర్వహించే పరమాత్ముడు, జీవుడు, లోకములు ఇలా కదా అందరం చూస్తున్నాము, ఇదంతా తాను (స్వాత్మాభిన్నత) అనే జ్ఞానం ఇవ్వవయ్యా!
- అంతా భగవంతుడు అని ఒకసారి కలిగితే కాదు, నిరంతరం (**వారము**) కలుగుతూ ఉండాలి! ఆత్మయే భగవానుడు!

- భగవానుడు అంటే? "**పరిపూర్ణ నిష్కళంక నిరవధి సుఖ దాయక**" పరిపూర్ణ, నిష్కళంకం, అవధి లేని ఆనందమే తన స్వరూపమైనది! ఇది రాముడంటే!

సారాంశం: ఆనందస్వరూపుడవు నువ్వు, ఆనందమే ఆత్మ అనే అనుభూతిని ఇచ్చేవాడవు, అది తప్ప మరొకటి లేదనే ఎరుక ఇచ్చేవాడవు!

*** ప. కదలువాడు కాడే రాముడు**

**కథలెన్నో కలవాడే**

**అ. మొదలు తానైనాడే తుద**

**మొదలు లేనివాడైనాడే (కదలు)**

**చ. కల్పనలెన్నడు లేదు**

**సంకల్పములే కలవాడు శేష**

**తల్ప శయనుడే వాడు శ్రీ**

**త్యాగరాజ నుతుడైనాడు (కదలు)**

- ఏ పరిణామమూ లేని అపరిణామ స్వరూపుడు! లోకం కోసం కథలు చూపించాడు! కదులుతున్న లోకాన్ని కదిలించే కదలిక లేని భగవానుడు! పరమాత్మయే రాములవారు అనే ఎరుక ఉన్నది త్యాగరాజస్వామికి!

భక్తి గుండెనిండా నిండిపోతే వచ్చే కీర్తన

*** ప. పక్కల నిలబడి కొలిచే ముచ్చట**

**బాగ తెల్ప రాదా**

**అ. చుక్కల రాయని కేరు మోము గల**

**సు-దతి సీతమ్మ సౌమిత్రి రామునికిరు (ప)**

**చ. తనువుచే వందనమొనరించుచున్నారా**

**చనువున నామ కీర్తన సేయుచున్నారా**

**మనసున తలచి మై మరచియున్నారా**

**నెనరుంచి త్యాగరాజునితో హరి హరి మీరిరు (ప)**

**అక్షరం, స్వరం చూస్తే భావం అలా కనపడుతుంది!**

- నిలబడి అనే మాట నిలబెట్టినట్లు ఉంటుంది! పదంభావం కి తగ్గట్లు స్వరరచన ఉంటుంది. రాముడికి సమీపంగా ఉండి కొలుచుకోవాలి అనిపిస్తుంది! ఆ భాగ్యం ఎవరికి ఉన్నది? అంటే లక్ష్మణస్వామి, సీతమ్మ. వీళ్లిద్దరు బయల్దేరింది ఆయన్ని కొలుచుకున్నారు. ఎలా కొలుచుకున్నారు ఆ ముచ్చట చెప్పండి అని అడుగుతున్నారు! వారి భాగ్యాన్ని చూసి మురిసిపోవడం, ఆ భాగ్యం తనకి రాలేదే అని అందమైన వేదన పడడం ఒకటి, వారు ఎలా కొలుచుకున్నారో తెలుసుకోవాలి!
- సీతమ్మ అంటే ఈయనకి ఎంత భక్తి అంటే ప్రతీ కీర్తనలో సీతమ్మని చెప్తారు ("సరి ఎవ్వరె అమ్మా జానకీ" అంటారు!)
- **చుక్కల రాయని కేరు మోము గల సుదతి సీతమ్మ** - చంద్రుడిని తీసిపారేసే మోముగల సీతమ్మా అంటున్నారు!
- ***మీరు తనువుచే వందనం ఒనరించుచున్నా రా - ప్రణిపాతం! శరీరాన్ని అర్చనకి, నమస్కారాలకి వినియోగించడం! అదే సార్థకం శరీరానికి!***
- ***చనువున రామకీర్తన చేయుచున్నా రా - నామకీర్తన ఎలా చేయాలో చెప్తున్నారు!***
  ***"ప్రేమముప్పిరిగొను వేళ" - భగవంతునితో ఆత్మీయ భావం!***
  ***మనసున తలచి మైమరచి ఉన్నా రా? - ఆయన్ని మనసులో తలంచుకుంటూ మైమరచిపోతున్నా రా? మనసున పరమాత్మని తలంచినప్పుడు వచ్చేది మైమరపు!*** నాపై దయ ఉంచి, ఈ ముచ్చటలు చెప్పండి!
- ఈ మూడూ ఎలా చేసారు అని అడుగుతున్నారు! ఇవి త్రికరణాలతో స్వామిని సేవించడం! వ్యాఖ్యానానికి అందనంత అనుభూతి ఉన్నది!
  పూర్వభాగవతులే తర్వాతి భాగవతులకి ఆచార్యులు!
  **తనవుచే ప్రారంభం అయి మనసుతో పూర్తి అవ్వాలి!**

* నీ భజనగాన రసికుల నేనెందు కాననురా

**ప. నీ భజన గాన రసికుల**

**నేనెందు కానరా రామ**

**అ. శ్రీ భవ సరోజాసనాది**

**శచీ మనో-రమణ వంద్య ఇలలో (నీ)**

**చ. సగుణ నిర్గుణపు నిజ దబ్బరలను**

**షణ్మతముల మర్మమష్ట సిద్ధుల**

**వగలు జూప సంతసిల్ల కంటిని**

**వరానన త్యాగరాజ వినుత (నీ)**

- అనేకమంది నీ భజన చేసాము అంటారు కానీ ఆ రసికులు కనపడరు! భక్తికి రసయోగం అని పేరు ఉన్నది! ఆ అనుభూతి వేరు! తర్కానికి అందదు!
- ఎలాంటివాళ్ళు కనపడుతున్నారంటే పనికిమాలిన వాదనలు చేసేవారు మాత్రమే కనపడుతున్నారు!
- వగలు = వివిధ రకాలు
- "భక్తీ గరీయసి" అని శాస్త్రం చెప్పిన మాట!
- "ప్రకాశ్యతే క్వాపి పాత్రే" అంటారు నారదులవారు!
- **నారదాభక్తి సూత్రాలు + త్యాగరాజ కీర్తనలు = ముక్తికి సోపానం!**
- ***అన్నీ శాస్త్రములు తరచి తరచితే తేలేది భక్తి ఒక్కటే ముక్తికి కారణం! ఎల్లవేళలా భక్తి అనే అమృత సముద్రంలో మునగాలి!***

* నీ భక్తిభాగ్యాసుధానిధి

**ప. నీ భక్తి భాగ్య సుధా**

**నిధినీదేదే జన్మము**

**అ. భూ-భారము కాని సుర**

**భూ-సురులై జనించిన (నీ)**

**చ. వేదోక్తంబౌ కర్మము**

**వెత గల్గు గతాగతమౌ**

**నాదాత్మక త్యాగరాజ**

**నాథాప్రమేయ సదా (నీ)**

*ఇంత సౌఖ్యమని నే చెప్పజాల ఎంతో ఏమో ఎవరికి తెలుసునో

**ప. ఇంత సౌఖ్యమని నే జెప్ప జాల**

**ఎంతో ఏమో ఎవరికి తెలుసునో**

**అ. దాంత సీతా కాంత కరుణా**

**స్వాంత ప్రేమాదులకే తెలుసును కాని (ఇ)**

**చ. స్వర రాగ లయ సుధా రసమందు**

**వర రామ నామమనే కండ**

**చక్కెర మిశ్రము జేసి భుజించే**

**శంకరునికి తెలుసును త్యాగరాజ వినుత (ఇ)**

- ఆ భక్తి వల్ల కలిగే ఆనందం స్వానుభవైక వేద్యము! ఈ మాట ఈయనే మరో కీర్తనలో అంటారు!
- భక్తి ఆనందాన్ని అనుభవించిన వాడు మరొకరికి చెప్పలేడు! ప్రేమాదులకే మాత్రం తెలుస్తుంది అంటున్నారు భక్తి ఆనందం!
- ***నిజమైన భక్తి ఎవరికి తెలుస్తుంది? స్వరరాగలయసుధారసమందు వర రామనామమనే కండ చక్కర కలిపి భుజించే శివుడికి తెలుసు!***

* **"రామనామరసికుడవు శంకరుడు సాక్షి"** అంటారు ఒక కీర్తనలో!

* **ప. ఆనంద సాగరమీదని దేహము**

**భూ భారము రామ (బ్రహ్మానంద)**

**అ. శ్రీ నాయకాఖిల నైగమాశ్రిత**

**సంగీత జ్ఞానము (బ్రహ్మానంద)**

**చ. శ్రీ విశ్వ నాథ శ్రీ కాంత విధులు**

**పావన మూర్తులుపాసించ లేదా**

**భావించి రాగ లయాదుల**

**భజియించే శ్రీ త్యాగరాజ నుత (ఆ)**

*అనురాగము లేని మనసున సుజ్ఞానము రాదు!

**ప. అనురాగము లేని మనసున సు-జ్ఞానము రాదు**

**అ. ఘనులైన అంతర్జ్ఞానులకెరుకే కాని (అ)**

**చ. వగ వగగా భుజియించే వారికి తృప్తియౌ రీతి**

**స-గుణ ధ్యానము పైని సౌఖ్యము త్యాగరాజ నుత (అ)**

- నిరన్తరాయమైన ప్రేమ ఉండాలి భగవంతుని మీద!
- ఈ విషయం అంతర్ముఖులకు తెలుసు!
- **వగ వగగా భుజియించే వారికి తృప్తియౌ రీతి** - బాగా ఆకలివేసిన వాడికి అన్నం పెడితే ఆబగా తింటూ ఆనందిస్తూ ఉంటాడే అలాగే ఆ భగవంతుని ధ్యానిస్తూ ఆనందిస్తూ ఉంటాడు.
- దీన్ని శంకరులు "కంచిత్కాలము"అనే శ్లోకంలో చెప్తారు!
- సగుణ మూర్తిని వివిధ విధాలుగా సేవించడం ఎంతో ఆనందం!

*తెలియలేరు రామా భక్తిమార్గమును

**ప. తెలియ లేరు రామ భక్తి మార్గమును**

**అ. ఇలనంతట తిరుగుచును**

**కలువరించేరు కాని (తె)**

**చ. వేగ లేచి నీట మునిగి భూతి పూసి**

**వేళ్ళనెంచి వెలికి శ్లాఘనీయులై**

**బాగ పైకమార్జన లోలులైరే**

**కాని త్యాగరాజ వినుత (తె)**

- **ఇలనంతట తిరుగుచునుకలువరించేరు కాని** (మనసుని నిలుకడగా ఉంచుకోకపోవడం) - ధ్యానానికి కూర్చుంటే మనసు నిలవదు!

- వేగ లేచి, నీటమునిగి, భూతిపూసి - అంటున్నారు అంటే వాటిని వద్దు అనడంలేదు! భక్తిని, వేషాలని భుక్తికి వాడేవారిని అంటున్నారు! అంతరంగంలో అనుభూతి ప్రధానం అని చెప్తున్నారు!
- భక్తి మార్గమూ తేలిక కాదు, తత్త్వ మార్గమూ తేలిక కాదు!

*తత్త్వమెరుగ తరమా? పరతత్త్వమెరుగ తరమా?

**ప. తత్వమెరుగ తరమా పర (తత్వ)**

**అ. తత్-త్వం-అసియను వాక్యార్థము**

**రామ నీవను పర (తత్వ)**

**చ. తామస రాజస గుణముల తన్నుకోళ్ళు పోదయా**

**రామ భక్తుడైన త్యాగరాజ వినుత వేద శాస్త్ర (తత్వ)**

పరతత్త్వము ఎరుగుట అంత తేలికా?

తత్ = బ్రహ్మము; త్వం = జీవుడు" తత్త్వమసి = బ్రహ్మము (త్వం కూడా బ్రహ్మమై పోతాడు)

కొందరు ఊరికే ఈ బ్రహ్మజ్ఞానం గురించి వాదాలు చేస్తూ ఉంటారు తామస, రాజస గుణాలతో!

వేదశాస్త్రాల ప్రతిపాదించే తత్త్వమసి అంత తేలికగా తెలుస్తుందా? అంటున్నారు!

త్యాగరాజ స్వామి యక్షగాన ప్రక్రియలు రచన చేసారు: ప్రహ్లాదభక్తివిజయం- జ్ఞానభక్తి, నౌకాచరిత్ర - గోపికా ప్రేమ రూపమైన భకి. ఈ రెండు కలిపి ఆయన హృదయం!

భక్తి కలిగినవాడు జ్ఞానాన్ని నిరసించడు! జ్ఞానం కలిగినవాడు భక్తిని నిరసించడు!

*ద్వైతము సుఖమా? అద్వైతము సుఖమా?

**ప. ద్వైతము సుఖమా అద్వైతము సుఖమా**

**అ. చైతన్యమా విను సర్వ సాక్షి**

**విస్తారముగాను తెల్పుము నాతో (ద్వై)**

**చ. గగన పవన తపన భువనాద్యవనిలో**

**నగ ధరాజ శివేంద్రాది సురులలో**

**భగవద్భక్త వరాగ్రేసరులలో**

**బాగ రమించే త్యాగరాజార్చిత (ద్వై)**

- తను పూజించే రాముని గురువుగా అడుగుతున్నారు! భగవంతుని గురువుగా ఆశ్రయిస్తే ఆయన అభేద జ్ఞానం ఇస్తాడు!
- చైతన్యమా విను! సర్వసాక్షి! - అని సంబోధించారు!
- చైతన్యం అంతటా వ్యాపించి, సర్వ సాక్షిగా ఉన్నది, త్రికాలాలని, త్రిలోకాలని అన్నిటిని గమనిస్తున్న సర్వసాక్షి!
- *ద్వైత, అద్వైత వాదాలు ఎప్పుడూ ఉంటాయి! సాధకుడికి ఈ విషయంలో మనస్సు కదులుతూ ఉంటుంది! అటువంటి సాధనా భూమికలు చెప్తున్న అంశములు! వ్యవహారంలో ద్వైతం, పరమార్థంలో అద్వైతం! వ్యవహారం నుండి పరమార్థం వైపు వెళుతున్న మార్గంలో పరమార్థం తగులుతూనే ఉంటుంది, అంటే ఈ రెండూ కలిసే వెళుతూ ఉంటాయి!*
- *కొందరు ద్వైతాన్ని ఇష్టపడితే, కొందరు అద్వైతాన్ని ఇష్టపడతారు, కానీ ద్వైతాద్వైతాలు రెండూ లేని సమతత్త్వాన్ని తెలుసుకునే వారు తక్కువ అంటున్నది వేదాంతము! అనుభూతిలోకి వెళిపోతే ద్వైతమూ, అద్వైతమూ అనే చర్చ ఉండదు!*

ఇంతకీ త్యాగయ్య ఏ మార్గము? సగుణరూపం వర్ణించాడు కనుక ద్వైతి యా? కానీ నిర్గుణము అని తెలుసుకుంటూనే చేసాడు కనుక అద్వైత మార్గమే! అది కూడా సాధనదశలో ముఖ్యమే! అద్వైతం కూడా సాధనలో ద్వైతాన్ని అంగీకరిస్తుంది! అద్వైతంలో సమన్వయము కనపడుతుంది!

ఆకాశాది భూతములు, సూర్య, చంద్ర, విష్ణు, బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు మొదలైన దేవతలలో, భగవద్భక్తులు, వారిలో గొప్పవారు, వీరందిరిలో ఆనందరూపుడిగా ఉన్న రామా! అంటున్నారు! సర్వ వ్యాపకమైన బ్రహ్మము అన్నప్పుడు క్రమంగా సర్వము, వ్యాపకం పోయి బ్రహ్మమే మిగలాలి!

* ఏ దారి సంచరింతురా ఇక పల్కరా

**ప. ఏ దారి సంచరింతురాయిక పల్కరా**

**అ. శ్రీ-దాది మధ్యాంత రహిత**

**సీతా సమేత గుణాకర నే(నే దారి)**

**చ. అన్ని తానను మార్గమున చనగ**

**నన్ను వీడను భారమనియాడెదవు**

**తన్ను బ్రోవు దాస వరదాయంటే**

**ద్వైతుడనెదవు త్యాగరాజ నుత (ఏ దారి)**

- ఆదిమధ్యాంతరహితా అంటూ నిర్గుణబ్రహ్మని, సీతాసమేత అంటూ సగుణాన్ని చూపిస్తున్నాడు
- "సోహం భావేన పూజయేత్" సర్వమూ నువ్వే, జీవుడు లేడు అంటే ఏమంటావు? అంతా బ్రహ్మమే అయితే ఇంక నేను రక్షించడం ఏమిటి అంటావేమో! విడిచిపెట్టేస్తావేమో
- నేను జీవుడు, నువ్వు దేవుడు అంటే ద్వైత భావం అంటావేమో

***సారాంశం: నిర్గుణ బ్రహ్మ జ్ఞానం కలిగి ఆ నిర్గుణ బ్రహ్మ మే తనని అనుగ్రహించడానికి సగుణబ్రహ్మ గా వచ్చాడని స్పృహతో, తనకి జీవభావం ఉన్నంతకాలం ఈశ్వరుని ఆశ్రయించాలి! క్రమక్రమంగా జీవభావం పోయి, తాదాత్మ్యం భావం ఇచ్చి ముక్తిని ఇస్తుంది!***

**ఆదిశంకరుల ప్రతిపాదన**

దేహబుద్ధ్యాతు దాసోహం జీవబుద్ధ్యాత్ త్వద్వంసకః

ఆత్మబుద్ధ్యాత్ త్వమేవాహం ఇతి మే నిశ్చితా మతిః

ఎంతవరకు దేహభావమో అంతవరకూ దేహభావం, జీవభావం/ఈశ్వరాంశ ఉన్నప్పుడు విశిష్టాద్వైత ఉంటుంది, చైతన్యం అయిన ఆత్మయే పరమాత్మ అని తెలిసినప్పుడు త్వమేవాహం!

ద్వైత, విశిష్టాద్వైత, అద్వైతములు పరస్పరము తన్నుకోళ్ళుతో ఉండే వాదములు కావు, అవి మూడు అందమైన మజిలీలు అని రామకృష్ణపరమహంస వివేకానంద స్వామికి చెప్పారు!

***త్యాగయ్య గురించి చెప్తూ పరమాచార్య వారు పై రెండూ కీర్తనలని ఉటంకించారు!***

***స్వామివారు అంటారు, "ఈ శంకరభగవత్పాద ప్రతిపాద సిద్ధాంతాన్ని బ్రహ్మవిద్యారసికుడైన త్యాగయ్య ఈ రెండూ కీర్తనలలో చూపించారు"!***

*పదవి నీ సద్భక్తి కలుగుటే

**ప. పదవి నీ సద్భక్తియు కల్గుటే**

**అ. చదివి వేద శాస్త్రోపనిషత్తుల**

**సత్త తెలియ లేనిది పదవియా (ప)**

**చ1. ధన దార సుతాగార సంపదలు**

**ధరణీశుల చెలిమియొక పదవియా (ప)**

**చ2. జప తపాదియణిమాది సిద్ధులచే**

**జగములనేచుటయది పదవియా (ప)**

**చ3. రాగ లోభ యుత యజ్ఞాదులచే**

**భోగములబ్బుటయది పదవియా (ప)**

**చ4. త్యాగరాజ నుతుడౌ శ్రీ రాముని**

**తత్వము తెలియనిదొక పదవియా (ప)**

- సద్భక్తి - సాత్త్విక, భావుకం! సద్భక్తి కలగాలి, నిష్కపటమైన ప్రేమ కావాలి, అది ముక్తికి హేతువు అవుతుంది! భక్తి సాధన తీవ్రం చేయాలి! లోకంలో హోదాలు ఏమి నిలబడతాయి! స్థిరమైన పదవి ఉంది అది పొందాలి!
- ఎన్ని చదివినా దానిలో సార విషయం తెలియనప్పుడు ఏమి లాభం!
- ధనము, గృహాలు నిర్మించుకోవడం, కుటుంబాలని పెంపొందించుకోవడం పదవియా?
- జపాదులు ఇవన్నీ భక్తియా? అంటే ఇక్కడ భక్తితో చేయని జపం గురించి మాట్లాడుతున్నారు.
- రామతత్త్వము తెలియనిది ఒక పదవియా? పరమాత్మ యొక్క యదార్థ స్వరూపం తెలియాలి, ఆ విచారణ చేయాలి! అది ముఖ్యం!

*** ప. మనసు స్వాధీనమైనయా ఘనునికి**

**మరి మంత్ర తంత్రములేల**

**అ. తనువు తాను కాదనియెంచు వానికి**

**తపసు చేయనేల దశరథ బాల (మ)**

**చ1. అన్ని నీవనుచుయెంచిన వానికి**

**ఆశ్రమ భేదములేల**

**కన్ను కట్టు మాయలనియెంచు వానికి**

**కాంతల భ్రమలేల దశరథ బాల (మ)**

**చ2. ఆజన్మము దుర్విషయ రహితునికి**

**గతాగతమికయేల**

**రాజ రాజేశ నిరంజన నిరుపమ**

**రాజ వదన త్యాగరాజ వినుత (మ)**

- మనస్సు ఎవడికి స్వాధీనం అవుతుందో, వాడికి మంత్రాలతో, యంత్రాలతో పని ఏమున్నది? అంటే అవి మనసుని స్వాధీనం చేయడానికి చేయమని చెప్పడం!
- దేహాత్మభ్రాంతి లేనివాడికి తపస్సే అక్కర్లేదు! తపస్సులా పరమార్థం దేహాత్మభ్రాంతి పోవాలి!
- ఆరూఢ స్థితికి (అంతా పరమాత్మ అని తెలిసినవాడికి) చేరినవాడికి ఆశ్రమ భేదములు ఎందుకు? (*సంసారులైతేనేమయ్యా శిఖిపింఛావతంసుడు)
- కనిపించే జగత్తంతా కనికట్టు అని తెలిసినవాడికి ఈ కాంతాది భ్రమలు ఏమి చేయలేవు!
- జీవితం ఉన్నంతకాలం దుర్విషయముల జోలికి వెళ్లనివాడికి పుట్టడము ఉండదు!

నాదమార్గాన్ని పరిపుష్టం చేసినవాడు! ప్రధాన లక్షణం భగవంతుడు తప్ప మరే బంధము లేని స్థితి!

*సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మాకు తండ్రి

**ప. సీతమ్మ మాయమ్మ శ్రీ రాముడు మా తండ్రి**

**అ. వాతాత్మజ సౌమిత్రి వైనతేయ రిపు మర్దన**

**ధాత భరతాదులు సోదరులు మాకు ఓ మనసా (సీ)**

**చ. పరమేశ వసిష్ఠ పరాశర నారద శౌనక శుక**

**సుర పతి గౌతమ లంబోదర గుహ సనకాదులు**

**ధర నిజ భాగవతాగ్రేసరులెవరో వారెల్లరు**

**వర త్యాగరాజునికి పరమ బాంధవులు మనసా (సీ)**

- మరి భగవంతుడే అన్నీ అనుకుంటే బంధుత్వాలు నిలవవు కదా అంటే ఇవి ఉండేవా నిలిచేవా
- *అనాథుడను కాదు నీవే అనాథుడవు
- నాకు దిక్కు లేదు అనడానికి లేదు,నువ్వే దిక్కు! నువ్వే అనాథవు అన్నారు

- భగవంతునికి అనాథ అని ఒక నామం ఉన్నది! నాథా అంటే ఈశ్వరుడు, ప్రభువు! ఆయన అందరికీ ఈశ్వరుడు! ఆయనకి ఎవరూ నాథుడు లేరు! మనకి నాథుడు లేకపోతె పతనం అవుతాము! అందరికీ దిక్కు అయినవాడు తనకి దిక్కు అనుకునేవాడు బలవంతుడు కదా!
- "సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మాకు తండ్రి" అనుకుంటూ బ్రతికితే మనం తల్లితండ్రుల చాటున బ్రతుకుతున్న పిల్లల్లా ఆనందంగా బ్రతికేయచ్చు! (పుట్టుభోగులము మేము - అన్నమయ్య).
- "సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మాకు తండ్రి" అనుకుంటే ఎంతమంది బంధువులో, ఎందరు ఆప్తులో చెప్తున్నారు! **పరమేశ వసిష్ఠ పరాశర నారద శౌనక శుక సుర పతి గౌతమ లంబోదర గుహ సనకాదులు ధర నిజ భాగవతాగ్రేసరులెవరో వారెల్లరు వర త్యాగరాజునికి పరమ బాంధవులు మనసా!**

## త్యాగరాజయోగము నాదయోగవిద్య

నాదబ్రహ్మ అని వీరికి మరో పేరు! నాదమే రాముడని ఉపాసించాడు!

*** ప. నాద సుధా రసంబిలను**

**నరాకృతియాయే మనసా**

**అ. వేద పురాణాగమ**

**శాస్త్రాదులకాధారమౌ (నాద)**

**చ. స్వరములారున్నొకటి ఘంటలు**

**వర రాగము కోదండము**

**దుర నయ దేశ్యము త్రి గుణము**

**నిరత గతి శరమురా**

**సరస సంగతి సందర్భము గల గిరములురా**

**ధర భజన భాగ్యమురా**

**త్యాగరాజు సేవించు (నాద)**

- నాదసుధారసము నరాకృతి దాల్చింది అని చెప్తున్నారు! నాదము యొక్క సారమైన అమృతం, ఆ సారమే పరమాత్మ!

- ఇక్కడ నాదము అంటే ప్రణవం, ప్రణవానికి కూడా మూలమైన పరమాత్మ నరాకృతి అయింది! ప్రణవం ఏది గమ్యంగా చెప్తున్నదో అది నాదసుధారసం! తను ఉపాసించే నాదానికి రామునికి భేధం లేదు అనే ఉత్కృష్టమైన ఉపాసన!
- నాదం (అనాహతం) -> ప్రణవం -> అ,ఉ, మ -> ఋగ్, యజు, సామములు -> పురాణాలూ/శాస్త్రాలు
- నాదము -> సప్తస్వరములు

  ధనుస్సు పట్టుకున్న రాములవారిని నాదరూపంలో చూపిస్తున్నారు!

  కోదండానికి ఏడు గంటలు ఉంటాయి - రాగం అనే కోదండానికి సప్తస్వరాలే గంటలు

  మూడు రకాల సంగీత పద్ధతులు - వింటినారి

  బాణాలు వేస్తె ఆగకుండా వచ్చే బాణాలు - రాగస్వర విన్యాసము

  ఆయన పలుకులు - సరససంగతిగిరములు
- అలాంటి రాముని భజించడమే భాగ్యం! ఆ నాదమూర్తి ప్రణవానికి కూడా లక్ష్యమైన పరమార్థ స్వరూపం!

* **ప. నాద తనుమనిశం శంకరం**

**నమామి మే మనసా శిరసా**

**అ. మోదకర నిగమోత్తమ సామ**

**వేద సారం వారం వారం (నా)**

**చ. సద్యోజాతాది పంచ వక్త్రజ**

**స-రి-గ-మ-ప-ధ-ని వర సప్త-స్వర**

**విద్యా లోలం విదళిత కాలం**

**విమల హృదయ త్యాగరాజ పాలం (నా)**

- నాద తనుం శంకరం అనే విషయం శార్ఙ్గధనుడు సంగీతరత్నాకరంలో చెప్తాడు!
- శివుడు ప్రణవమూర్తి, నాదమే శరీరంగా కలిగినవాడు!
- ఆనందాన్ని కలిగించే నిగమాల్లో గొప్పదైన సామవేద సారం నాదం, అది శరీరంగా కలిగినవాడు శంకరుడు, ఆయన్ని నేను భజిస్తున్నాను!

- చిత్తరంజని రాగంలో స్వరపరిచారు! ఈ రాగంలో వచ్చే స్వరాలు సామగాన మూర్ఛనలలో వచ్చే స్వరాలు!
- *కాలాతీత విఖ్యాత అనే మాట కూడా గుర్తు తెచ్చుకోవాలి! కాలబద్ధమైన సంగీతం కాలాతీతము అయినా నాదాన్ని తెలియజేయాలి!*
- సద్యోజాత – ద; వామదేవ – మ; అఘోర – గ; తత్పురుష – రి; ఈశాన – ని; శివహృదయం - స గౌరీదేవి హృదయం – ప; సప్తస్వర సంగీత విద్య శివుడే!
- సప్తస్వరాలు కాలబద్ధములై సంచరిస్తూ కాలాతీతమైన శివతత్త్వాన్ని ప్రతిపాదిస్తాయి!

*** ప. నాద లోలుడై**

**బ్రహ్మానందమందవే మనసా**

**అ. స్వాదు ఫల ప్రద సప్త**

**స్వర రాగ నిచయ సహిత (నా)**

**చ. హరి హరాత్మ భూ-సుర పతి**

**శర జన్మ గణేశాది**

**వర మౌనులుపాసించ రే**

**ధర త్యాగరాజు తెలియు (నా)**

ఆయన దృష్టిలో సప్తస్వరాలు దేవతలు!

నాదోపాసన పద్ధతులు చెప్పారు! స్వరాలకి, మనలోని షట్చక్రాలకు అనుబంధం ఉంటుంది, ఏడూ వారాలలో ఒక్కో వారానికి ఒక్కో స్వరదేవతని ఉపాసించడం ఉన్నది!

*** ప. శోభిల్లు సప్త స్వర**

**సుందరుల భజింపవే మనసా**

**అ. నాభి హృత్కంఠ రసన**

**నాసాదులయందు (శో)**

**చ. ధర ఋక్ సామాదులలో**

**వర గాయత్రీ హృదయమున**

సుర భూ-సుర మానసమున

శుభ త్యాగరాజునియెడ (శో)

- స్థానాలు: నాభి, హృత్, కంఠం, రసన, నాస వీటిల్లో ఆ శబ్దం పలుకుతూ ఉంటుంది!
- ఇది అనాహత నాదం వినే పద్ధతి! ఆహత నాద సంగీత సాధనతో అనాహతం వినగలగాలి!

  *మూలాధారాజనాదమెరగుటె ముదమగు

- *శోభిల్లు సప్తస్వర
- సామమంత్రములు ఋక్కులను తీస్కుని సామంగా గానం చేస్తాయి అని చెప్పడం
- గాయత్రీమంత్రంలో సప్తస్వరాలు ఉన్నాయట!
- సుర, భూసురులు - దేవతలు, సాధకులు

* ప. సీతా వర సంగీత జ్ఞానము

ధాత వ్రాయవలెరా

అ. గీతాద్యఖిలోపనిషత్సార భూత

జీవన్ముక్తుడగుటకు (సీ)

చ. ఆకాశ శరీరము బ్రహ్మమనే

ఆత్మా రాముని తా సరి జూచుచు

లోకాదులు చిన్మయమను సుస్వర

లోలుడౌ త్యాగరాజ సన్నుత (సీ)

- సంగీతజ్ఞానం అంటే పరమాత్మ ఇవ్వవలసినదే! జీవన్ముక్తుడు అయ్యేటందుకు కావలసిన సంగీతజ్ఞానం!
- "ఆకాశశరీరము బ్రహ్మమనే ఆత్మారాముని తా సరిజూచుచు" శబ్దం ఆకాశ గుణకం, నాదరూపమైన సంగీతం ఆకాశం నుండి వచ్చింది, ఆకాశం ఎక్కడిది? దహరాకాశంలో ఆనందరూపుడై విహరించే బ్రహ్మము నుండి! అటువంటి రాములవారిని ఉపాసిస్తూ చెప్పారు!
- దహరాకాశంలో రాముని ఉపాసిస్తే లోకములు చిన్మయములు అని తెలుస్తాయి!

* ప. సంగీత జ్ఞానము భక్తి వినా

సన్మార్గము కలదే మనసా

అ. భృంగి నటేశ సమీరజ ఘటజ

మతంగ నారదాదులుపాసించే (సం)

చ. న్యాయాన్యాయము తెలుసును జగములు

మాయామయమని తెలుసును దుర్గుణ

కాయజాది షడ్రిపుల జయించు

కార్యము తెలుసును త్యాగరాజునికి (సం)

- భక్తి లేనప్పుడు సంగీతజ్ఞానం సన్మార్గము అవ్వదు! సంగీతం యోగము అయ్యేది భక్తి కలిసినప్పుడు! సంగీతజ్ఞానము, భక్తి ఈ రెండూ లేకపోతే సన్మార్గము లేదు అని మరో అర్థం! ఈ రెండే త్యాగయ్య జీవితం! జీవన విధానం: భక్తి; లక్ష్యం: రాములవారు! అలా బ్రతికారు, సంగీతజ్ఞానంతో ఉన్నారు!
- సంగీతం ఎటువంటివారి నుండి వచ్చిందో తెలిస్తే నమస్కరించుకుంటాము! సంగీతాన్ని ఉపాసించారు వీరంతా! భృంగి నటేశ సమీరజ ఘటజ మతంగ నారదాదులుపాసించే
- అలా ఉపాసించేవారికి ఏమి లభిస్తుంది? 1) న్యాయము, అన్యాయములు తెలుస్తాయి (విధి, నిషేధము) 2) జగములు మాయమయములు అని తెలుస్తుంది 3) ఇంద్రియనిగ్రహం 4) పరమాత్మ ప్రాప్తి

* ప. సొగసుగా మృదంగ తాళము జత కూర్చి నిను

సొక్క జేయు ధీరుడెవ్వడో

అ. నిగమ శిరోర్థము కల్గిన

నిజ వాక్కులతో స్వర శుద్ధముతో (సొ)

చ. యతి విశ్రమ సద్భక్తి

విరతి ద్రాక్షా రస నవ-రస

యుత కృతిచే భజియించు

యుక్తి త్యాగరాజుని తరమా శ్రీ రామ (సొ)

ఎందుకు పాడాలి? ఎలా ఉండాలి?

1) పరమాత్మ పరవశించేటట్లు పాడడానికి!

2) ఉపనిషత్తుల అర్థాలు కలిసిన వాక్కులు నీదయిన అనుభూతితో కలిపి రావాలి

3) స్వరశుద్ధం

4) యతి, విశ్రమ స్థానముల గురించి చెప్పారు, ద్రాక్షారసములా ఉండాలి!

5) విరక్తి, సద్భక్తి

*విదులకు మ్రొక్కెద సంగీత కోవిదులకు మ్రొక్కెద

స్వర్గము అంటేసుఖము, ఆపవర్గము అంటే మోక్షము రెండూ ఇస్తుంది!

ప. విదులకు మ్రొక్కెద సంగీత కో(విదులకు)

అ. ముదమున శంకర కృత సామ నిగమ

విదులకు నాదాత్మక సప్త స్వర (వి)

చ. కమలా గౌరీ వాగీశ్వరీ విధి

గరుడ ధ్వజ శివ నారదులు

అమరేశ భరత కాశ్యప చండీశ

ఆంజనేయ గుహ గజ ముఖులు

సు-మృకండుజ కుంభజ తుంబురు వర

సోమేశ్వర శార్ఙ్గ దేవ నందీ

ప్రముఖులకు త్యాగరాజ వంద్యులకు

బ్రహ్మానంద సుధాంబుధి మర్మ (వి)

* ప. స్వర రాగ సుధా రస యుత భక్తి

స్వర్గాపవర్గమురా ఓ మనసా

అ. పరమానందమనే కమలముపై

బక భేకము చెలగియేమి ఓ మనసా (స్వ)

**చ1. మూలాధారజ నాదమెరుగుటే**

**ముదమగు మోక్షమురా**

**కోలాహల సప్త స్వర గృహముల**

**గురుతే మోక్షమురా ఓ మనసా (స్వ)**

**చ2. బహు జన్మములకు పైని జ్ఞానియై**

**పరగుట మోక్షమురా**

**సహజ భక్తితో రాగ జ్ఞాన**

**సహితుడు ముక్తుడురా ఓ మనసా (స్వ)**

**చ3. మర్దల తాళ గతులు తెలియకనే**

**మర్దించుట సుఖమా**

**శుద్ధ మనసు లేక పూజ జేయుట**

**సూకర వృత్తిరా ఓ మనసా (స్వ)**

**చ4. <u>రజత గిరీశుడు నగజకు తెల్పు</u>**

**<u>స్వరార్ణవ మర్మములు</u>**

**విజయము గల త్యాగరాజుడెరుగే**

**విశ్వసించి తెలుసుకో ఓ మనసా (స్వ)**

- సంగీత లక్షణాలు తెలియకుండా పాడడం ఎటువంటిది అంటే కమలము వద్ద ఉన్న కప్ప, కొంగ లా ఉన్నట్లే!
- సంగీతంలో స్వరాలూ అవన్నీ చూసి కోలాహలం చూడడం కాదు, వాటి గురుతు తెలుసుకోవాలి!
- మద్దెల తాళం తెలియకుండా మ్రోగిస్తే భయంకరంగా ఉంటుంది, అలాగే భక్తి లేకుండా పాడడం సూకరవృత్తి

*** ప. రాగ సుధా రస పానము జేసి**

**రంజిల్లవే ఓ మనసా**

**అ. యాగ యోగ త్యాగ భోగ ఫలమొసంగే (రా)**

**చ. సదాశివ మయమగు నాదోంకార స్వర**

**విదులు జీవన్ముక్తులని త్యాగరాజు తెలియు (రా)**

రాగయోగము - రాగ, యోగ, త్యాగ, భోగములను ఇవ్వగలదు!

*** ప. మోక్షము గలదా భువిలో**

**జీవన్ముక్తులు కాని వారలకు**

**అ. సాక్షాత్కార నీ సద్భక్తి**

**సంగీత జ్ఞాన విహీనులకు (మో)**

**చ. ప్రాణానల సంయోగము వల్ల**

**ప్రణవ నాదము సప్త-స్వరములై పరగ**

**వీణా వాదన లోలుడౌ శివ మనో-**

**విధమెరుగరు త్యాగరాజ వినుత (మో)**

- ఊరికనే పాడేస్తూ ఉన్నారే కానీ శివుని మనస్సు తెలుసుకోవడంలేదే అంటున్నారు!
- ప్రాణం, అనలం ఈ రెండిటివల్ల నాదం పుడుతుంది! పాణిని కూడా ఇదే చెప్తారు!
- నీలోని పరమాత్మ చైతన్యమే నాదముగా, ఆ నాదము సప్తస్వరములుగా వికసిస్తూ ఉంటాయి! ఆ సప్తస్వరములు సరిగ్గా వెన్ను వీణ మీద సంచరిస్తూ ఉంటాయి, వీణ పట్టుకున్న మోక్ష స్వరూపుడైన దక్షిణామూర్తిని చూపిస్తున్నారు!
- " *మర్రిమాని మొదలులో కుర్రవాడు వీడు.... వేలికొనల లీలగ నా వెన్ను వీణ సవరించి లాలనతో నాదరహస్యాల గరపువాడు"( శివపదం)*
- వెన్ను వీణ మీటేటువంటి ఆ నాదానికి మూలమైన ఆత్మయే వీణ మీటుతున్న శివుడు, వీణ మీటుతున్న సరస్వతి దేవి!

***ఘనరాగపంచరత్నాలు - నాట, గౌళ, ఆరభి, వరాళి, శ్రీ రాగాల్లో అయిదు కీర్తనలు రచించారు!**

వీణలో తానవిస్తరణ చేసేటప్పుడు చక్కగా భాసించే రాగాలు!

1 -జగదానందకారక ఇది స్తుతి చేసే కీర్తన

జగదానందకారకా - రామతత్త్వమంతా పల్లవిలో పెట్టారు!

ఆనందస్వరూపుడే రాములవారు! (రమించు వారెవరురా)! సర్వజీవులలో ఆనన్దరూపంగా ఎవరు ఉన్నారో ఆయనే రాముడు!

రాముడు జగదానందకారకుడు అవతరించినప్పుడే కాదు, ఇప్పుడు కూడా! ఎవరు ఎప్పుడు ఆశ్రయిస్తే అప్పుడు ఆనందాన్ని (బ్రహ్మానందం అనే కైవల్యం) ఇస్తాడు! సీతమ్మని మరువలేదు,

జయజానకీప్రాణనాయక

**ప. జగదానంద కారక**

**జయ జానకీ ప్రాణ నాయక**

**అ. గగనాధిప సత్కులజ రాజ రాజేశ్వర**

**సు-గుణాకర సుర సేవ్య భవ్య దాయక**

**సదా సకల (జ)**

**చ1.అమర తారక నిచయ కుముద హిత**

**పరిపూర్ణానఘ సుర సుర భూజ**

**దధి పయోధి వాస హరణ**

**సుందర-తర వదన సుధా-మయ వచో-**

**బృంద గోవింద సానంద**

**మా-వరాజరాప్త శుభ కరానేక (జ)**

**చ2. నిగమ నీరజామృతజ**

**పోషకానిమిష వైరి వారిద సమీరణ**

**ఖగ తురంగ సత్కవి హృదాలయాగణిత**

**వానరాధిప నతాంఘ్రి యుగ (జ)**

**చ3. ఇంద్ర నీల మణి సన్నిభాపఘన**

**చంద్ర సూర్య నయనాప్రమేయ**

**వాగీంద్ర జనక సకలేశ శుభ్ర**

**నాగేంద్ర శయన శమన వైరి సన్నుత (జ)**

**చ4. పాద విజిత మౌని శాప సవ**

**పరిపాల వర మంత్ర గ్రహణ లోల**

పరమ శాంత చిత్త జనకజాధిప

సరోజ భవ వరదాఖిల (జ)

చ5. సృష్టి స్థిత్యంత-కారకామిత

కామిత ఫలదాసమాన గాత్ర

శచీ పతి నుతాబ్ధి మద హరానురాగ

రాగ రాజిత కథా సార హిత (జ)

చ6. సజ్జన మానసాబ్ధి సుధా-కర

కుసుమ విమాన సురసా రిపు కరాబ్జ

లాలిత చరణావ-గుణాసుర గణ

మద హరణ సనాతనాజ నుత (జ)

చ7. ఓంకార పంజర కీర పుర

హర సరోజ భవ కేశవాది

రూప వాసవ రిపు జనకాంతక కలా-

ధర కలా ధరాప్త ఘృణా-కర

శరణాగత జన పాలన సు-మనో-

రమణ నిర్వికార నిగమ సారతర (జ)

చ8. కర ధృత శర జాలాసుర

మదాపహరణావనీ సుర సురావన

కవీన బిలజ మౌని కృత చరిత్ర

సన్నుత శ్రీ త్యాగరాజ నుత (జ)

చ9. పురాణ పురుష నృ-వరాత్మజాశ్రిత

పరాధీన ఖర విరాధ రావణ

వి-రావణానఘ పరాశర మనో-

హరావికృత త్యాగరాజ సన్నుత (జ)

చ10. అగణిత గుణ కనక చేల

సాల విదళనారుణాభ సమాన

**చరణాపార మహిమాద్భుత సు-కవి జన**

**హృత్సదన సుర ముని గణ విహిత**

**కలశ నీర నిధిజా రమణ పాప గజ**

**నృ-సింహ వర త్యాగరాజాది నుత (జ)**

2 - నైత్యానుసంధానము (దుడుకు గల నన్ను ఏ దొర కొడుకు బ్రోచురా)

అల్పత్వాన్ని పరమాత్మ వద్ద అంగీకరించడం! దొరకొడుకు అంటే రాజపుత్రుడు!

దుడుకుగల నన్ను ఏ రాజకొడుకు కాపాడతాడు! చపలత కలిగినవాడిని, స్థిరం లేనివాడిని!

ఎప్పుడూ దుర్విషయలచేత ఆకర్షింపబడుతున్న చపలుడిని నన్ను నువ్వే కాపాడాలి!

దుడుకు ఏమిటి? సకలభూతములయందు నిన్ను హృదయంలో చూడలేకపోవడం అనే దుడుకుతనం

ఉన్నవాడిని! సాధనకి ఏమి ప్రయత్నం చేయకుండా తిరిగితినయ్యా!

***ప. దుడుకు గల నన్నే దొర**

**కొడుకు బ్రోచురా ఎంతో (దు)**

**అ. కడు దుర్విషయాకృష్టుడై**

**గడియ గడియకు నిండారు (దు)**

**స్వర సాహిత్య -**

**1. శ్రీ వనితా హృత్కుముదాబ్జ**

**అవాఙ్-మానస గోచర (దు)**

**2. సకల భూతములయందు నీవై-**

**యుండగ మతి లేక పోయిన (దు)**

**3. చిరుత ప్రాయము నాడే భజనామృత**

**రస విహీన కు-తర్కుడైన (దు)**

**4. పర ధనముల కొరకునొరుల మది**

**కరగ పలికి కడుపు నింప తిరిగినట్టి (దు)**

**5. తన మదిని భువిని సౌఖ్యపు జీవనమే-**

**యనుచు సదా దినములు గడిపే (దు)**

6. తెలియని నట-విట క్షుద్రులు వనితలు
స్వ-వశమౌటకుపదేశించి
సంతసిల్లి స్వర లయంబులెరుంగకను
శిలాత్ములై సు-భక్తులకు సమానమను (దు)
7. దృష్టికి సారంబగు లలనా
సదనార్భక సేనామిత ధనాదులను
దేవ దేవ నెర నమ్మితిని గాకను
పదాబ్జ భజనంబు మరచిన (దు)
8. చక్కని ముఖ కమలంబును సదా
నా మదిలో స్మరణ లేకనే
దుర్మదాంధ జనుల కోరి పరితాప-
ములచే తగిలి నొగిలి దుర్విషయ
దురాసలను రోయ లేక సతత-
మపరాధినై చపల చిత్తుడైన (దు)
9. మానవ తను దుర్లభమనుచునెంచి
పరమానందమొంద లేక
మద మత్సర కామ లోభ మోహులకు
దాసుడై మోస పోతి గాక
మొదటి కులజుడగుచు భువిని
శూద్రుల పనులు సల్పుచునుయుంటిని గాక
నరాధములను కోరి సార హీన
మతములను సాధింప తారుమారు (దు)
10. సతులకై కొన్నాళ్ళాస్తికై
సుతులకై కొన్నాళ్ళు ధన
తతులకై తిరిగితినయ్య
త్యాగరాజాప్త ఇటువంటి (దు)

3 - సాధించెనే ఓ మనసా! ఇది చాలా గంభీరమైన కీర్తన!

ఒక అర్థం: పరమాత్మ తాను ఇచ్చిన మాటని నిలబెట్టుకోవడానికి ఏ విధంగా అయినా సంచరిస్తాడు

ఒక్కొక్క అవతారంలో ఒక్కో విధంగా!

రెండో అర్థం: రక్షిస్తాను అని మాట ఇచ్చి కూడా నన్ను ఇంకా రక్షించడం లేదు! అని మరో అర్థం!

**ప. సాధించెనే ఓ మనసా**

**అ. బోధించిన సన్మార్గ వచనముల**

**బొంకు జేసి తా పట్టిన పట్టు (సా)**

**చ. సమయానికి తగు మాటలాడెనే**

**స్వర సాహిత్య**

**స్వ1. దేవకి వసు దేవులనేకించినటు (సమ)**

**స్వ2. రంగేశుడు సద్గంగా జనకుడు**

**సంగీత సాంప్రదాయకుడు (సమ)**

**స్వ3. గోపీ జన మనోరథమొసంగ**

**లేకనే గేలియు జేసే వాడు (సమ)**

**స్వ4. వనితల సదా సౌక్య జేయుచును**

**మ్రొక్క జేసే పరమాత్ముడదియు గాక**

**యశోద తనయుడంచు ముదంబునను**

**ముద్దు పెట్ట నవ్వుచుండు హరి (సమ)**

**స్వ4(A). సారాసారుడు సనక సనందన**

**సన్ముని సేవ్యుడు సకలాధారుడు (సమ)**

**స్వ5. పరమ భక్త వత్సలుడు సుగుణ**

**పారావారుండాజన్మమనఘుడీ**

**కలి బాధల తీర్చువాడనుచు నే**

**హృదంబుజమున జూచుచుండగ (సమ)**

**స్వ6. హరే రామ చంద్ర రఘు కులేశ**

**మృదు సుభాష శేష శయన**

**పర నారీ సోదరాజ విరాజ తురగ**

**రాజ రాజ నుత నిరామయాపఘన**

**సరసీరుహ దళాక్షయనుచు**

**వేడుకొన్న నన్ను తా బ్రోవకను (సమ)**

**స్వ7. శ్రీ వేంకటేశ స్వప్రకాశ**

**సర్వోన్నత సజ్జన మానస నికేతన**

**కనకాంబర ధర లసన్మకుట**

**కుండల విరాజిత హరేయనుచు నే**

**పొగడగా త్యాగరాజ గేయుడు**

**మానవేంద్రుడైన రామ చంద్రుడు (సమ)**

**చ. సమయానికి తగు మాటలాడెనే**

**సద్భక్తుల నడతలిట్లనెనే**

**అమరికగా నా పూజ కొనెనే**

**అలుక వద్దనెనే**

**విముఖులతో చేర బోకుమనెనే**

**వెత కలిగిన తాళుకొమ్మనెనే**

**దమ శమాది సుఖ దాయకుడగు శ్రీ**

**త్యాగరాజ నుతుడు చెంత రాకనే (సా)**

4 - రామమూర్తి సౌందర్యం, తత్త్వం రెండూ వర్ణించారు - కనకనరుచిరా

చూసేకొద్దీ ఇంకా ఆనందం కలిగించే ఆనందం కలిగిస్తే రమణీయం అంటారు, అదే రాములవారు!

దినదినమును(సర్వకాలములయందు), మనసున (మనస్సుతో), చనువున (అతిప్రీతిగా) చూడాలి!

**ప. కన కన రుచిరా**

**కనక వసన నిన్ను (కన)**

**అ. దిన దినమును మనసున**

**చనువున నిన్ను (కన)**

చ1. పాలు కారు మోమున శ్రీయపార

మహిమ తనరు నిన్ను (కన)

చ2. కల-కలమను ముఖ కళ కలిగిన సీత

కులుకుచునోర కన్నులను జూచు నిన్ను (కన)

చ3. బాలార్కాభ సు-చేల మణి-మయ

మాలాలంకృత కంధర

సరసిజాక్ష వర కపోల సు-రుచిర

కిరీట ధర సంతతంబు మనసారగ (కన)

చ4. సా-పత్ని మాతయౌ సురుచి-చే

కర్ణ శూలమైన మాట వీనుల

చురుక్కన తాళక శ్రీ హరిని ధ్యానించి

సుఖింపగ లేదాయటు (కన)

చ5. మృగ మద లలామ శుభ నిటిల వర

జటాయు మోక్ష ఫలద పవమాన

సుతుడు నీదు మహిమ తెల్ప

సీత తెలిసి వలచి సొక్క లేదా ఆ రీతి నిన్ను (కన)

చ6. సుఖాస్పద విముఖాంబు ధర పవన

వి-దేహ మానస విహారాప్త

సుర భూజ మానిత గుణాంక

చిదానంద ఖగ తురంగ ధృత రథాంగ

పరమ దయా-కర కరుణా రస వరుణాలయ

భయాపహర శ్రీ రఘుపతే (కన)

చ7. కామించి ప్రేమ మీర కరముల నీదు

పాద కమలముల పట్టుకొను

వాడు సాక్షి రామ నామ రసికుడు

కైలాస సదనుడు సాక్షి

మరియు నారద పరాశర శుక

శౌనక పురందర నగజా ధరజ

ముఖ్యులు సాక్షి కాద సుందరేశ

సుఖ కలశాంబుధి వాసాశ్రితులకే (కన)

చ8. సతతము ప్రేమ పూరితుడగు త్యాగరాజ

నుత ముఖ జిత కుముద హిత వరద నిన్ను (కన)

5 - ఎందరో మహానుభావులు: అలాంటి స్వామిపై భక్తి ఉన్న వారే మహానుభావులు! అలాంటి భాగవతోత్తములకు నమస్కరిస్తూ రచించిన కీర్తన!

ప. ఎందరో మహానుభావులందరికి వందనము

అ. చంద్ర వదనునియంద చందమును

హృదయారవిందమున జూచి

బ్రహ్మానందమనుభవించు వా(రెందరో)

చ1. సామ గాన లోల మనసిజ లావణ్య

ధన్య మూర్ధన్యు(లెందరో)

చ2. మానస వన చర వర సంచారము సలిపి

మూర్తి బాగుగ పొడగనే వా(రెందరో)

చ3. సరగున పాదములకు స్వాంతమను

సరోజమును సమర్పణము సేయు వా(రెందరో)

చ4. పతిత పావనుడనే పరాత్పరుని గురించి

పరమార్థమగు నిజ మార్గముతోను

పాడుచును సల్లాపముతో

స్వర లయాది రాగములు తెలియు వా(రెందరో)

చ5. హరి గుణ మణి-మయ సరములు గళమున

శోభిల్లు భక్త కోటులిలలో

తెలివితో చెలిమితో కరుణ కల్గి

జగమెల్లను సుధా దృష్టిచే బ్రోచు వా(రెందరో)

చ6. హొయలు మీర నడలు కల్గు సరసుని
సదా కనుల జూచుచును పులక శరీరులై
ఆనంద పయోధి నిమగ్నులై
ముదంబునను యశము కల వా(రెందరో)
చ7. పరమ భాగవత మౌని వర శశి
విభా-కర సనక సనందన
దిగీశ సుర కింపురుష కనక కశిపు
సుత నారద తుంబురు
పవన సూను బాల చంద్ర ధర శుక
సరోజ భవ భూ-సుర వరులు
పరమ పావనులు ఘనులు శాశ్వతులు
కమల భవ సుఖము సదానుభవులు గాక(యెందరో)
చ8. నీ మేను నామ వైభవంబులను
నీ పరాక్రమ ధైర్యముల
శాంత మానసము నీవులను
వచన సత్యమును రఘువర నీయెడ
సద్భక్తియు జనించకను దుర్మతములను
కల్ల జేసినట్టి నీ మది-
నెరింగి సంతసంబునను గుణ
భజనానంద కీర్తనము సేయు వా(రెందరో)
చ9. భాగవత రామాయణ గీతాది
శ్రుతి శాస్త్ర పురాణపు
మర్మములను శివాది షణ్మతముల
గూఢములను ముప్పది ముక్కోటి
సురాంతరంగముల భావంబుల-

నెరింగి భావ రాగ లయాది సౌఖ్యముచే
చిరాయువుల్ కల్గి నిరవధి సుఖాత్ములై
త్యాగరాజాప్తులైన వా(రెందరో)
చ10. ప్రేమ ముప్పిరికొను వేళ
నామము తలచే వారు
రామ భక్తుడైన త్యాగ-
రాజ నుతుని నిజ దాసులైన వా(రెందరో)

త్యాగయ్య పదాల్లో సౌందర్యం చాలా చక్కగా చూపిస్తారు! ఆయన సంగీతంలో తెలుగు, సంస్కృతం కూడా అద్భుతంగా పలుకుతాయి! చదువుతున్నప్పుడే సంగీతం వినిపించేలా రచించాడు మహానుభావుడు!

"సుందరముఖమరవిందనయనం.... "

"ధీరం భువనాకారం సుగుణాకారం సమలంకారం దుర్జనదూరం శ్రీరఘువీరం మే హృది వారం వారం!

"వరపూషవంశభూషణ నతపోషణ మృదుభాషణ రిపుభీషణ నరవేషణ నగభూషణ వరశేషభూషతోషితానఘా"

ఇన్ని విధాలుగా నాదోపాసన చేసి, పంచరత్న కృతులు మొదలైన లోతయిన కృతులు చేసి మహానుభావుడు జీవనమంతా రామమయం చేసుకున్నాడు. ధర్మాన్ని ఇసుమంత కూడా తప్పకుండ నిరాడంబరమైన జీవితం గడిపారు! సంగీతజ్ఞానం, భక్తి అనే సన్మార్గంతో రామమయంగా జీవించినవాడికి కొన్నాళ్ళకి అంటే ఇంకా పది పూటలలో ముక్తిని పొందుతాడు అనగా రాములవారు దర్శనం ఇచ్చి, సన్యాసం స్వీకరించమని చెప్పారు, పదిరోజులలో తనని చేరుతావు అన్నారు! సన్యాసం సామాన్య విషయం కాదు, జీవన్ముక్తిని తెలియచేస్తుంది. అప్పుడు త్యాగరాజస్వామి వారు సన్యసించి, రాములవారు దర్శనం ఇచ్చిన దృశ్యాన్ని మాటిమాటికి తలంచుకుంటూ ఎలా కనపడ్డాడో, ఎలా మాట్లాడాడో వర్ణిస్తారు!

ఆ కనిపించిన స్వామిని ధ్యానిస్తూ రచించిన కీర్తనలు రెండు!

* ప. గిరిపై నెలకొన్న రాముని

గురి తప్పక కంటి

అ. పరివారులు విరి సురటులచే

నిలబడి విసరుచు కొసరుచు సేవింపగ (గిరి)

చ. పులకాంకితుడై ఆనందాశ్రువుల

నింపుచు మాటలాడ వలెనని

కలువరించ కని పది పూటలపై

కాచెదనను త్యాగరాజ వినుతుని (గిరి)

అటు ఇటు ఆయనను పరివారములు సేవిస్తూ ఉన్నారు! అటువంటి స్వామిని చూడగానే పులకరించిపోయి, ఏదో మాట్లాడదాం అనుకున్నాను, నా నోటా మాటరావడంలేదు! అటువంటి నన్ను చూసి రామచంద్రమూర్తి అన్నారు పది పూటలలో నిన్ను కాచెదను అని!

కొండకొన అంతరార్థం: శరీరం కొండ అనుకుంటే, మూలాధారము నుండి సహస్రారం వరకు ఒక్కొక్క చక్రం ఒక్కొక్క శిఖరం! కొండకొన అంటే సహస్రారం! అదే "గిరిపై నెలకొన్న రాముని గురితప్పక కంటి" లోని ఆంతర్యం! సహస్రారాంతర్గతమైన పరమాత్మ అనుభవమే!

ముక్తులు: జీవన్ముక్తులు, క్రమముక్తులు! ఉపాసకులకు ఇక ముక్తి లభిస్తుంది అన్నప్పుడు కౌషితికి ఉపనిషత్తు చెప్తున్నది, ఒక ఉన్నత శిఖరంపై భగవత్ చైతన్యం సాక్షాత్కరిస్తుంది అని! అలా ఉపనిషత్తు చెప్పినది ఈయనకి అనుభవానికి వచ్చింది!

* ప. పరితాపము కనియాడిన

పలుకుల మరచితివో నా (పరి)

అ. సరి లేని సీతతో

సరయు మధ్యంబున నా (పరి)

చ. వరమగు బంగారు వాడను

మెరయుచు పది పూటలపై

కరుణించెదననుచు క్రే-

కనుల త్యాగరాజుని (పరి)

- స్వామి నేను పరితాపముతో ఉన్నప్పుడు నువ్వు నాతో పలికిన పలుకులు మర్చిపోయావా? ఇంకా అనుగ్రహించవే? అదే కావాలి అనే ఆర్తి ఉన్న వారికి తెలుస్తుంది!
- భగవంతుడు అనుగ్రహించేవరకు ఒక తొందర! ఇక అనుగ్రహిస్తాను  అని మాట ఇచ్చాక, ఎప్పుడు అనుగ్రహిస్తాడా? ఆ సమయం ఎప్పుడు వస్తుందా అనే ఆర్తి పెరిగిపోతుంది! ఆ తహతహ!
- దర్శనం ఎలా ఇచ్చారో చెప్తున్నారు! ఇది కూడా ఉత్కృష్టమైనది! **సరి లేని సీతతో సరయు మధ్యంబున నా (పరి)**

*** ప. నగు మోము కన లేని నా జాలి తెలిసి**

**నన్ను బ్రోవ రాదా శ్రీ రఘువర నీ (నగు)**

**అ. నగ రాజ ధర నీదు పరివారులెల్ల**

**ఒగి బోధన జేసే వారలు కారేయటులుండుదురే నీ (నగు)**

**చ. ఖగ రాజు నీయానతి విని వేగ చన లేడో**

**గగనానికిలకు బహు దూరంబనినాడో**

**జగమేలే పరమాత్మ ఎవరితో మొరలిడుదు**

**వగ జూపకు తాళను నన్నేలుకోరా త్యాగరాజ నుత నీ (నగు)**

"తాళను నన్నేలుకోరా" అన్నప్పుడు నిష్కపటమైన భక్తి కనపడుతుంది!

***తనువుచే వందనం.... మనసున తలచి మైమరచి"**

పై రెండూ కీర్తనల్లో స్వర రచన కూడా ఎక్కడ తారాస్థాయికి వెళ్లాలో అక్కడ తారాస్థాయి స్వరకల్పన చేసారు! అది ఔచిత్యం!

**ఆయన జాలి అంతా ఒకటే దర్శనవాంఛ, దర్శనలాలస, దర్శన పిపాస!**

*** ప. ఎన్నడు జూతునో ఇన కుల తిలక ని(న్నె)**

**అ. పన్నగ శయన భక్త జనావన**

**పున్నమ చందురు బోలు ముఖమును (ఎ)**

**చ. ధరణిజా సౌమిత్రి భరత రిపుఘ్న**

**వానర యూథ పతి వరుడాంజనేయుడు**

**కరుణను ఒకరికొకరు వర్ణింప-**

**నాదరణను పిలిచే నిన్ను త్యాగరాజార్చిత (ఎ)**

***పరితాపము గనియాడిన పలుకులు మరచితివో**

సిద్ధి పొందిన రోజున పాడిన పాట ఉన్నది! ఆయన సన్యాసం స్వీకరించాక గ్రామానికి బయటే ఉండిపోయాడు! అలాగే చేయాలి! అది సన్యాసంలో నియమాలు! పూర్తి సన్యాస పద్ధతి పాటించి ముక్తిని పొందారు! అందుకే ఆయనకి ఆరాధన ఉత్సవాలు చేస్తున్నాము! ఆయన సంగీతకారుడు కాదు, సన్యాసి, పరమహంస, యోగి, జీవన్ముక్తుడు, నాదసుధారసమైన పరమాత్మని అనుభవంలోకి తెచ్చుకున్న సిద్ధపురుషుడు!

"జ్ఞానమొసగరాదా" అన్నప్పుడు ఎటువంటి జ్ఞానం అడిగారో అది పొందారు! అది ఈ కీర్తన ద్వారా తెలుస్తుంది!

*పరమాత్ముడు వెలిగే ముచ్చట అంటూ వాగధీశ్వరి రాగంలో గానం చేసారు!

**ప. పరమాత్ముడు వెలిగే ముచ్చట**

**బాగ తెలుసుకోరే**

**అ. హరియట హరుడట సురులట నరులట**

**అఖిలాండ కోటులట అందరిలో (ప)**

**చ. గగనానిల తేజో-జల భూ-మయమగు**

**మృగ ఖగ నగ తరు కోటులలో**

**స-గుణములో వి-గుణములో సతతము**

**సాధు త్యాగరాజాది ఆశ్రితులలో (ప)**

- సర్వం రామమయం అని అనుభవానికి వచ్చి అంటున్నాడు!
- ***భావించి పాడడం ఒకటి, అనుభవించి పాడడం ఒకటి! భావాన్ని అనుభవించి పాడడం మొదట చేస్తే, అనుభవమే భావాతీత స్థితిలో మనకోసం పాటగా వచ్చింది!***
- పరమాత్ముడు చిత్స్వరూపుడై వెలిగిపోతున్నాడు! ఎక్కడ? అన్నిచోట్లా!

ఈ కీర్తనని ఆయన చివర కీర్తనగా చెప్తారు!

1847 సంవత్సరంలో జనవరి 6వ తేదీ పుష్య బహుళ పంచమి నాడు మహానుభావుడైన త్యాగయ్య సిద్ధిపొందిన రోజు! ఆయన పరమపదించారు, ఆరాధ్య మూర్తి అయ్యారు!
చుట్టూ శిష్యులు అడిగారట, రాములవారు పదిపూటల్లో అనుగ్రహిస్తారని చెప్పారు కదా, మీరు వెళ్ళాక మీ శరీరాన్ని ఏమి చేయమంటారు అని! త్యాగయ్య ఆదేశించారు, గురువులైన శొంఠి వెంకటరమణయ్య గారి సమాధి వద్ద తులసిబృందావనం రూపంగా ఏర్పాటు చేయమన్నారు! 60 ఏళ్ళు దాటాక నా శిష్యపరంపర ద్వారా దీని ప్రభావం ప్రకాశిస్తుంది అని చెప్పారట!

ఎందరో శిష్యులు ఆయన గానాన్ని పరంపరగా ప్రాచుర్యంలోకి తీసుకువస్తూ ఉన్నారు! ఆయన శిష్యులకి శిష్యుల శిష్యురాలైనవారు ఒకావిడ ఉన్నారు! ఆ మహాత్ముఁరాలు బెంగుళూరు నాగరత్నం గారు! దేవదాసి కుటుంబానికి చెందినవారు! ఆవిడ సంగీతసాహిత్యాలతో భగవంతుని సేవించుకున్న ప్రతిభామూర్తి! తరవాత ఆవిడ చెన్నై నగరానికి వచ్చి ఉండేవారు! అక్కడుంటూ త్యాగయ్య శిష్య ప్రశిష్యుల వద్ద ఇంకా సంగీత మెళకువలు నేర్చుకుంటూ, త్యాగరాజే దైవంగా భావించారు! ఆవిడ శ్రీవిద్యోపాసకురాలు కూడా! అమ్మవారిని, కులదైవమైన వేంకటేశ్వరుని పూజించేవారు. త్యాగయ్య అంటే ఆవిడకు దేవుడు అనే భావం! మహావైరాగ్యంతో త్యాగయ్య కీర్తనలని గానం చేస్తూ ఉండేవారు! అప్పటికే తనకున్న ద్రవ్యాన్ని అనేక దేవకైంకర్యాలకి వినియోగించేవారు! ఏదో ధర్మకార్యాలు చేయాలనే చింతతో ఉండేవారు! ఒకప్పుడు ఆవిడ పూజిస్తూ ఉండగా త్యాగయ్య పటంలో ఉన్న రూపంతోనే సమాధి నుండి పైకి వచ్చినట్లు దర్శనం ఇచ్చి, అభయం ఇచ్చినట్లు కనపడి అంతర్ధానం అయ్యారు! ఆమెకి సంకేతం కలిగి త్యాగరాజు మందిరాన్ని ఏర్పాటు చేసారు 1925 జనవరి 7వ తేదీన స్థాపన చేసారు. అక్కడ ఆరాధన ఉత్సవాలు 1927లో నాగరత్నం గారు ప్రారంభించారు! నేటికీ త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు ఆవిడ ఏర్పరిచిన పద్ధతిలోనే జరుగుతున్నాయి!

## సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు